

సీవోఈకి నోటిఫికేషన్ ఎప్పుడో!

సీవోఈ కళాశాలల్లో 2025-2026 విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ జారీలో జాప్యం జరుగుతోంది. దీంతో విద్యార్థులు నిరీక్షిస్తున్నారు. 8లో▸



పెరిగిన 'ఉపాధి' లక్ష్యం

ఉపాధిహామీ పథకం కింద జిల్లాలో గతేడాది నిర్దేశించిన పనిదినాల కంటే అధికంగా పనులు జరిగాయి. దీంతో ఈ ఏడాది పని దినాల పెంపునకు ప్రతిపాదించారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0 /19.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి కాస్త పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పెండింగ్ కేసులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌అర్బన్: పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని, పోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరగా ఇన్వెస్టిగేషన్ పూర్తి చేయాలని, అసాంఘిక కార్యకలాపాలు గంజాయి, జూదం, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై దృష్టి సారించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష నిర్వహించి మాట్లాడారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీటీవీల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని, మహిళల భద్రతకు భరోసా కల్పించాలని సూచించారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వినియోగంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఎస్పీ ప్రభాకర్ రావ్, డీఎస్పీలు కరుణాకర్, రామానుజం, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో ఉండాలి



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డేవిడ్

చింతలమానెపల్లి: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ సూచించారు. శనివారం మండలంలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. రవీంద్రనగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, వరిధాన్యం కొనుగోలు కేంద్రం, తహసీల్దార్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. పీహెచ్‌సీలో రికార్డులు, పరిసరాలు పరిశీలించారు. కుక్కకాటు మందు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వైద్యాధికారి రాజ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

శనీశ్వరుడికి ప్రత్యేకపూజలు



శనీశ్వరుడికి తైలాభిషేకం చేస్తున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లోగల కనకదుర్గాదేవీ, స్వయంభూ మహంకాళీ ఆలయ ప్రాంగణాల్లో శనివారం శని త్రయోదశి సందర్భంగా శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో వచ్చి శనీశ్వరుడికి పూజలు చేశారు. నువ్వుల నూనెతో తైలాభిషేకాలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అర్చకుడు వినోద్ తీర్థప్రసాదాలు అందజేశారు.


31లోపు సర్వే పూర్తి చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న డీపీవో భిక్షపతిగౌడ్

కెరమెరి: ఈ నెల 31లోపు ఇందిరమ్మ సర్వే పూర్తి చేయాలని డీపీవో భిక్షపతిగౌడ్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇందిరమ్మ సర్వేను పరిశీలించారు. ఆన్‌లైన్‌లో జాప్యంపై కారణాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో అఫ్జల్‌పాషా, పంచాయతీ కార్యదర్శులున్నారు.

క్రమశిక్షణ తప్పనిసరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మహేశ్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు క్రమశిక్షణ తప్పనిసరి అని జిల్లా బాలల సంరక్షణాధికారి మహేశ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పిల్లల సమగ్ర అభివృద్ధి కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి కుటుంబానికి గుర్తింపు తీసుకురావాలని, చెడు వ్యసనాల బారినపడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. బాలల రక్ష భవన్ సిబ్బంది చంద్రశేఖర్, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ యాదగిరి, అధ్యాపకులు సంతోష్, సునీత తదితరులున్నారు.

వైద్యం.. దైన్యం

- అలంకారప్రాయంగా పెద్దాస్పత్రి!
- అందని కార్పొరేట్ వైద్యసేవలు
- రోగులకు తప్పని ఇబ్బందులు
- తప్పనిసరి పరిస్థితిలో 'ప్రైవేట్'కు..
- నిరుపేద రోగులపై ఆర్థికభారం



రివైండ్ 2024 వైద్యం

ఆసిఫాబాద్: జిల్లా ఏర్పాటై ఎనిమిదేళ్లయినా ఇంకా వైద్యసేవలు మెరుగుపడలేదు. సర్కారు దవాఖానాల్లో సరైన వైద్యం అందక రోగులు 'ప్రైవేట్' దోపిడీకి గురవుతున్నారు. రోగులకు పూర్తిస్థాయి వైద్య సేవలందక జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి అలంకారప్రాయంగా మారింది. 50 పడకల సామాజిక ఆస్పత్రిని 100 పడకలుగా అప్‌గ్రేడ్ చేశారు. మదర్ చైల్డ్ కింద 250 పడకల ఆస్పత్రిగా మార్చారు. గతేడాది జిల్లా కేంద్రానికి మెడికల్ కళాశాల మంజూరు కాగా దీనిని 300 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. ఆస్పత్రి స్థాయి వివిధ దశల్లో పెరిగినా వైద్యసేవల్లో మార్పు కానరావడం లేదని జిల్లావాసులు ఆరోపిస్తున్నారు.

సరిపడా లేని వైద్యులు, సిబ్బంది

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి స్థాయి పెంచినా ప్రస్తుతం ముగ్గురు రెగ్యులర్ వైద్యులు, ఐదుగురు కాంట్రాక్ట్ వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. ఆస్పత్రిలో గైనకాలజిస్ట్, ఫోరెన్సిక్, రేడియాలజిస్ట్, సైక్రియాట్రిస్ట్, కంటి వైద్యులతో పాటు స్పెషలైజ్ వైద్యులు లేక రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ లేక శస్త్రచికిత్సలు జరగడం లేదు. దీంతో ... కాన్పులకు ఆస్పత్రికి ... రావడానికి మహిళలు వెనుకడుగు వేస్తున్నా రు. ఏజెన్సీలోని ... లింగాపూర్, సిర్పూర్ (యూ), జై నూర్ ప్రాంతాల్లో రెగ్యులర్ వైద్యులు లేక ఇన్‌చార్జీలతో వెల్లదీసున్న పరిస్థితి ఉంది.

ఆస్పత్రిలో మందుల కొరత

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో తరచూ మందుల కొరత కారణంగా రోగులు ప్రైవేట్‌లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఆస్పత్రిలో ప్రత్యేక రేడియాలజీ విభాగం ఉన్నా రేడియాలజిస్ట్ లేక గర్భిణులకు స్కానింగ్ నిర్వహించడం లేదు. ఆస్పత్రిలో రోజుకు సుమారు 500కు పైగా ఓపీ ... నమోదవుతోంది. పదుల సంఖ్యలో ఇన్‌పేషెం...ట్లు చికిత్స పొందుతున్నారు. ప్రతీనెల ... సుమారు 60 కాన్పులు జరుగుతున్నాయి. గైన...కాలజిస్ట్ లేక సర్జరీల కోసం మంచిర్యాల, కరీంనగర్ లాంటి ప్రాంతాలకు వెళ్తున్నారు.

కానరాని కార్పొరేట్ సేవలు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో రాత్రి వేళ కూడా ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. సమీప వాంకిడి, కెరమెరి, రెబ్బెన, తిర్యాణి మండలాల ప్రజలకు ఈ ఆస్పత్రే పెద్ద దిక్కుగా ఉంది. నిత్యం అధికసంఖ్యలో వివిధ సమస్యలతో రోగులు ఈ ఆస్పత్రికి వస్తుంటారు. కానీ, వైద్యులు జ్వరాలు, సీజనల్ వ్యాధుల చికిత్సకే పరిమితమవుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాథమిక చికిత్స చేసి, మంచిర్యాల, కరీంనగర్ లాంటి ప్రాంతాలకు రెఫర్ చేయడం పరిపాటిగా మారింది. స్కానింగ్ మిషన్ ఉన్నా సక్రమంగా పని చేయక రోగులు మంచిర్యాలకు వెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా హృద్రోగ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక నిపుణులు, చికిత్స లేక అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బంది పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్‌లలోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఈ ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ ఉన్నా వైద్యులు లేక సర్జరీలు జరగడం లేదు. చిన్న పిల్లలకూ వైద్యం అందక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తుండటంతో పేదలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాలకు వైద్య సేవలందించేందుకు గతంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో అంబులెన్స్‌లు సమకూర్చినా ప్రస్తుతం అవి వినియోగంలో లేవు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులు 102, 108 వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

మెడికల్ కాలేజీలోనూ సమస్యలే..



జిల్లా కేంద్రంలోని వైద్యకళాశాల

మండలంలోని అంకుసాపూర్ శివారులో గతేడాది కొత్తగా ఏర్పాటైన మెడికల్ కళాశాలలో నీట్ ప్రవేశ పరీక్ష ద్వారా రెండేళ్లలో ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి ఏటా 100 మంది చొప్పున 200 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు తొలుత 300 పడకల ఆస్పత్రి కోసం నిర్మిస్తున్న భవనాన్ని ప్రస్తుతం వైద్య కళాశాలగా మార్చారు. కొత్తగా ఏర్పాటైన వైద్యకళా శాలలో 22 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కళాశాలలో 115 మంది ప్రొఫెసర్లు అవసరముండగా, ప్రస్తుతం ఏడుగురు మాత్రమే విధులు నిర్వహిస్తుండటం గమనార్హం. ప్రస్తుతం కళాశాలలో 27 మంది ప్రొఫెసర్లకు గాను ఇద్దరు, 30 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు గాను ఒక్కరు, 58 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు గాను నలుగురు విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా ఈ ఏడాది నర్సింగ్ కళాశాల ఏర్పా టు కాగా, 39 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. కళాశాల ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

శాంతిభద్రతలు భేష్!



వార్షిక నివేదిక విడుదల చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, ఏఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు

- జిల్లాలో తగ్గిన దొంగతనాలు
- 5శాతం తగ్గిన సైబర్ నేరాలు
- వార్షిక నివేదికలో ఎస్పీ వెల్లడి

2023, 2024లో నేరాల వివరాలు

నేరాలు	2023	2024
హత్యాయత్నాలు	21	32
హత్యలు	22	12
ఇళ్లలో పగటి చోరీలు	7	1
ఇళ్లలో రాత్రి చోరీలు	34	29
దొంగతనాలు	63	50
కిడ్నాప్‌లు	24	18
అత్యాచారాలు	27	24
రోడ్డు ప్రమాదాలు	125	123
జైలు శిక్ష పడ్డవి	29	48
పోక్సో	20	27
ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ	24	34
సైబర్ నేరాలు	26	21

రివైండ్ 2024 శాంతిభద్రతలు

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లాలో 2023తో పోల్చితే 2024లో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయి. దొంగతనాల సంఖ్య తగ్గింది. హత్యలు, కిడ్నాప్, రేప్ కేసులు తగ్గుముఖం పట్టాయి. పోలీసులు ఎప్పటికప్పుడు ప్రజలకు ఎస్సీ, ఎస్టీ, పోక్సో, సైబర్ నేరాలు, మహిళలపై అఘాయిత్యాలపై అవగాహన కల్పించారు. దీంతో చాలావరకు మోసాలకు అడ్డుకట్ట పడినా కేసుల సంఖ్య మాత్రం బాగా పెరిగింది. గంజాయి కేసులు 129 శాతం పెరగడం గమనార్హం. ముందుజాగ్రత చర్యలతో రోడ్డు ప్రమాదాలూ తగ్గడం విశేషం. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు శనివారం విడుదల చేసిన 'వార్షిక నేర గణాంక నివేదిక-2024'లో సంబంధిత అంశాలను ప్రస్తావించారు.

పెరిగిన కేసులు

జిల్లాలో ఈ సంవత్సరం 144 కేసులు అధికంగా నమోదయ్యాయి. 'డయల్ 100'కు ఫోన్లు పెరిగాయి. ఈ-పెట్టి కేసులు 3,600, గంజాయి కేసులు 22 పెరగగా, గేమింగ్ యాక్ట్ కేసులు 151 నమోదయ్యాయి. సైబర్ నేరాలు 5శాతం తగ్గాయి. మొత్తంగా 2023 ఏడాదిలో 1,063 కేసులు నమోదు కాగా, 2024లో 11 శాతం పెరిగి 1,207 కేసులు నమోదయ్యాయి.

పెట్రోలింగ్ ముమ్మరం

జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పోలీస్ సబ్ డివిజన్లలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో కొన్ని నెలలుగా కాలనీలు, బస్తీల్లో బ్లూకోల్ట్స్ తదితర సిబ్బంది పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. దీంతో దొంగతనాలకు చాలావరకు అడ్డుకట్ట పడింది. గతేడాదితో పోల్చుకుంటే 13 శాతం తగ్గాయి.

సీసీ కెమెరాలతో కేసులు పరిష్కారం

నేరాలు అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రధాన కూడళ్లు, కాలనీల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కేసులను పరిష్కరించేందుకు దోహదపడ్డాయి. సీసీ కెమెరాల సాయంతో గతేడాది ఒక కేసు ఛేదించగా.. ఈ ఏడాదిలో తొమ్మిది కేసులు పరిష్కారమయ్యాయి. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాల్లో భాగంగా 746 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

మీ కోసం..

పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలకు సైబర్ సెక్యూరిటీ, రోడ్ సేఫ్టీ, గుడ్ టచ్-బ్యాడ్‌టచ్, గంజాయి, ఆన్‌లైన్ మోసాలు, గుట్కా, జూదం, మహిళల భద్రత, కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 19న బెజ్జూర్ మండలం నాగవల్లి గ్రామంలో పేదప్రజలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, యువతకు వాలీబాల్, క్రికెట్ కిట్లు ఇచ్చారు. వైద్యశిబిరాన్ని నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంగళవారం జైనూర్‌లో ఆదివాసీ మహిళలకు పోలీసులు ఉచితంగా 35 కుట్టు మిషన్లు అందజేశారు. రెబ్బెన మండలంలోని గోండుగూడ, కాగజ్‌నగర్ డివిజన్‌లోని కనికి, హెట్టి, తాటిపల్లి, సిర్పూర్ (యూ) మండలంలోని పవర్‌గూడ గ్రామాల్లోని పేద ప్రజలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

వేతనాలు చెల్లించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్: వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో 104 ఉద్యోగుల శనివారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడారు. గత అక్టోబర్ నుంచి 104 ఉద్యోగులకు వేతనాలు చెల్లించడంలేదని, దీంతో వారు కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డిసెంబర్ 4న జీవో 706ను విడుదల చేస్తూ రూ.12.56 కోట్లు విడుదల చేసినా నేటి వరకు ఉద్యోగులకు చెల్లించలేదని ఆరోపించారు. 104 ఉద్యోగులను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని కాలేజీలు, ఇనిస్టిట్యూట్‌లలో సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చి ఉత్తర్వులు ఇవ్వలేదని పేర్కొన్నారు. 104 ఉద్యోగులను డీఎంఈ పరిధిలోకి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 104 ఉద్యోగులు రవి, అనిల్‌కుమార్, తిరుపతి, మల్లేశ్, ప్రశాంత్ తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: జనవరి 3వ తేదీలోపు గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ హెచ్చరించారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేసి వేతనాలు పెంచాలని, జీవో 51ని సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా కల్పించాలని, వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జనవరి 3లోపు సమస్యలు పరిష్కరించకుంటే 4వ తేదీ తర్వాత నిరవధిక సమ్మెకు పంచాయతీ కార్మికులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. నాయకులు కృష్ణమాచారి, జాడె మోరేశ్వర్, నగేశ్, అజీజ్, పుష్పలత, శంకర్, రాణి తదితరులున్నారు.

బెజ్జూర్ పీహెచ్‌సీ తనిఖీ

బెజ్జూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు సేవలందించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ భూమేశ్వర్, ఏపీఎం మోహన్ తదితరులున్నారు.

పత్తి కొనుగోళ్లలో అక్రమాలను అరికట్టాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి కొనుగోళ్లలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని సీపీఐ నాయకులు శనివారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీసీఐ కేంద్రాలకు పత్తి విక్రయించేందుకు వెళ్లిన రైతులను అధికారులు తేమ శాతం ఎక్కువగా ఉన్నట్లు చెబుతూ కొనుగోలుకు నిరాకరిస్తున్నారని ఆరోపించారు. దీంతో రైతులు పక్కనున్న దళారులకు క్వింటాల్‌కు రూ.6,600కే విక్రయిస్తున్నారని తెలిపారు. తిరిగి ఇదే పత్తిని దళారులు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐకి రూ.7,521కు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. దళారులు, అధికారులు కలిసి రైతులను దగా చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వారిపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసినవారిలో నాయకులు శన రాజన్న, దుర్గం దినకర్, శ్రీనివాస్, ఆనంద్, కార్తీక్ ఉన్నారు.

వర్చువల్ విధానంలో విద్యార్థులకు బోధన

కెరమెరి(ఆసిఫాబాద్): వర్చువల్ విధానంలో విద్యార్థులకు ఉన్నత స్థాయి బోధన అందించనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా తెలిపారు. మండలంలోని హట్టి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో స్వోధన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వర్చువల్ తరగతులను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు తరగతులు నిర్వహించడంలో స్వోధన్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. డీడీ రమాదేవి, జీసీడీవో శకుంతల, హెచ్‌ఎం పంచపూల, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కరుణాకర్‌రెడ్డి తదితరులున్నారు.

డిజిటల్ ల్యాబ్‌తో ప్రయోజనాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా



గ్రూప్-4 అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కెరమెరి(ఆసిఫాబాద్): డిజిటల్ ల్యాబ్‌తో ఎన్నో ప్రయోజనాలున్నాయని, విద్యార్థులు ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటే దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా సూచించారు. శనివారం మండలంలోని హట్టి ఆశ్రమ పాఠశాలలో డిజిటల్ ల్యాబ్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల ముగిసిన తర్వాత గంటపాటు డిజిటల్ ల్యాబ్‌లో కూర్చొని అర్థం కాని పాఠాలను వినాలనిసూచించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కలెక్టర్, పీవో వెంట ఐటీడీఏ డీడీ రమాదేవి, ఏసీఎంవో ఉద్దవ్, జీసీడీవో శకుంతల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జంగుబాయి ఉత్సవాలపై సమీక్ష

కెరమెరి: జనవరి 2 నుంచి మండలంలోని మహరాజ్‌గూడ అడవుల్లో నిర్వహించనున్న జంగుబాయి ఉత్సవాలపై హట్టి గ్రామంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే శనివారం ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తాతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతరలో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. అనంతరం ఉత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. డీడీ రమాదేవి, డీపీవో భిక్షపతిగౌడ్, డీఎస్పీ కరుణాకర్, తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంపీడీవో అఫ్జల్‌పాషా, ఇంజినీరింగ్ అధికారులు, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు మరపబాజీరావు, సభ్యులున్నారు.

నియామక పత్రాలు అందజేత

ఆసిఫాబాద్‌అర్బన్: రెవెన్యూ విభాగంలో ఎంపికైన 36 మంది గ్రూప్-4 అభ్యర్థులకు కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే శనివారం అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావ్‌తో కలిసి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేపల చెరువు పరిశీలన

వాంకిడి: మండలంలోని సరాండి గ్రామ శివారులో రైతులు ఏర్పాటు చేసుకున్న చేపల చెరువును కలెక్టర్ వెంకటేశ్ దోత్రే శనివారం పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేపల పెంపకంపై రైతులను ప్రోత్సహిస్తూ సలహాలు, సూచనలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట మత్స్యశాఖ జిల్లా అధికారి సాంబశివరావు, తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి



వివరాలు తెలుసుకుంటున్న దీపక్ తివారి

కాగజ్‌నగర్ రూరల్: డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. శనివారం కాగజ్‌నగర్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మౌలిక వసతుల పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ కిరణ్‌కుమార్ తదితరులున్నారు.

క్లుప్తంగా

వాహనం ఢీకొని కోతి మృతి



మృతి చెందిన కోతి

భీమారం: మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారిపై శనివారం పోలంపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కోతి మృతి చెందింది. వాహనదారులు కోతులకు ఆహారపదార్థాలు వేయగా అవి గుంపుగా వచ్చి తినే ప్రయత్నం చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీకొనడంతో ఓ కోతి మృతిచెందింది. వారంలో కనీసం 10కి పైగా కోతులు మృతి చెందుతున్నాయి. ఇప్పటికైనా అటవీ అధికారులు జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహించి వాహనదారులు ఆహారం వేయకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ



నుజ్జునుజ్జయిన లారీ ముందు భాగం

సోన్: లారీ డివైడర్ ఢీకొట్టిన ఘటన మండలంలోని గంజాల్ టోల్ ప్లాజా వద్ద చోటుచేసుకుంది.. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు.. మహారాష్ట్ర నుంచి కేరళలోని కొచ్చిన్‌కు ఫైబర్ డోర్స్ లోడుతో లారీ వెళ్తోంది. శుక్రవారం అర్ధరాత్రి గంజాల్ టోల్‌ప్లాజా వద్ద డ్రైవర్ నిద్రలో జారుకోవడంతో లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. క్లీనర్ అరుణ్ మురుగన్ ఫిర్యాదుతో డ్రైవర్ సర్వరాజ్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై షేక్‌అహ్మద్ తెలిపారు.

భార్యపై హత్యాయత్నం

ఆదిలాబాద్‌టౌన్: భార్యపై భర్త తీవ్రంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ కథనం ప్రకారం.. బొక్కల్‌గూడకు చెందిన సయ్యద్ అన్వర్ గత కొంతకాలంగా భార్యను తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నాడు. శనివారం భార్యపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గాయాలపాలైన ఆమెను కుటుంబీకులు రిమ్స్‌కు తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్వర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ తెలిపారు.

బావిలో దూకి ఆత్మహత్య

తలమడుగు: బావిలో దూకి ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం..ఆదిలాబాద్ పట్టణంలోని దుర్గానగర్‌కి చెందిన గంగన్న (41) బతుకుదెరువు కోసం మూడు నెలల క్రితం తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి వలసవచ్చాడు. కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగవద్దని భార్య మందలించడంతో క్షణికావేశంలో శనివారం రాత్రి రుయ్యాడి సమీపంలో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు.

సీవోఈ నోటిఫికేషన్ ఎప్పుడో?

- విడుదలలో జాప్యం
- ఎదురుచూస్తున్న విద్యార్థులు
- 'పది'లో మార్కుల ఆధారంగా ప్రవేశాలనే ప్రచారం
- అధికారిక ప్రకటన లేక ఊహాగానాలు



బెల్లంపల్లి సంక్షేమ బాలుర సీవోఈ కళాశాల ముఖద్వారం

బెల్లంపల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నోటిఫికేషన్ కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ, జనరల్ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశపరీక్షకు ఈనెల 18న నోటిఫికేషన్ విడుదల కాగా, సీవోఈలో ప్రవేశానికి నోటిఫికేషన్ జారీలో జాప్యం జరుగుతోంది. ఏటా డిసెంబర్ రెండు లేదా మూడో వారంలో నోటిఫికేషన్ విడుదల చేస్తుండగా ఈసారి ఆలస్యం అవుతుండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పదో తరగతిలో సాధించిన మార్కుల ప్రాతిపదికన విద్యార్థులకు ఈసారి అడ్మిషన్ కల్పిస్తారనే ప్రచారం జరుగుతోంది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) ఈవిషయంలో అధికారికంగా ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోయినప్పటికీ రకరకాలుగా ఊహాగానాలు వస్తున్నాయి. ఈకారణంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో పది వార్షిక పరీక్షలు రాయబోతున్న విద్యార్థులు ఎటూ తేల్చుకోలేక సతమతమవుతున్నారు. సీవోఈ ప్రవేశపరీక్షకు సిద్ధం కావాలా లేక పదో తరగతి పరీక్ష మెరుగ్గా రాయాలా అనే సందిగ్ధంలో ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో రెండు సీవోఈలు..

ఉమ్మడి జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలు రెండు ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలో బెల్లంపల్లి కేంద్రంగా బాలుర సీవోఈ, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బాలికల సీవోఈ కళాశాలలు ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ప్రవేశపరీక్ష నిర్వహించి వీటిలో మెరిట్ విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు. ఒక్కో కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో రెండేసి సెక్షన్ల చొప్పున 80 మంది విద్యార్థులకు అడ్మిషన్ కల్పిస్తారు. సాధారణ గురుకులాల కన్నా సీవోఈ కళాశాలల్లో ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఇంటర్ విద్యాబోధన చేస్తూనే నీట్, ఎంసెట్ తదితర పోటీ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉన్నతంగా తీర్చిదిద్దుతారు. సీవోఈ కళాశాలల్లో ప్రవేశానికి విద్యార్థుల్లో విపరీతమైన క్రేజీ ఏర్పడి ఏటేటా పోటీ రెట్టింపవుతోంది.

విద్యార్థులకు వరం..

సీవోఈల్లో ప్రవేశం దక్కితే చాలు విద్యార్థుల భవిష్యత్ బంగారు మయమవుతుందనేది తల్లిదండ్రుల ఆశ. ఈకారణంగానే పదో తరగతి చదువుతున్న తమ పిల్లలకు సీవోఈ ప్రవేశపరీక్ష రాయడానికి ప్రత్యేకంగా కోచింగ్ ఇప్పిస్తుండటం చేస్తున్నారు. ప్రవేశం పొందిన విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదువులో, పోటీ పరీక్షల్లో నెగ్గేలా ఉన్నతంగా తీర్చిదిద్దడంలో సీవోఈలు ప్రత్యేకతను ఏర్పర్చుకున్నాయి. ఈ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పోటీ పరీక్షలు రాసి ఏటా పదులసంఖ్యలో ఇంజినీరింగ్, మెడిసిన్ సీట్లతోపాటు ఐఐటీలోనూ ప్రవేశం పొందుతున్నారు.

వారంలో వస్తుంది



విద్యార్థులు ఎలాంటి గందరగోళానికి గురికావద్దు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ కళాశాలల్లో ప్రవేశానికి ఎప్పటిమాదిరిగా ఈసారి ప్రవేశపరీక్ష నిర్వహిస్తాం. పదో తరగతిలో వచ్చిన మార్కుల ప్రాతిపదికన సీటు కేటాయించడం జరగదు. ప్రవేశపరీక్షకు సంబంధించి వారంలో నోటిఫికేషన్ వస్తుంది. విద్యార్థులు పరీక్షకు సిద్ధమై ప్రతిభను చాటుకోవాలి.

– అరుణకుమారి, జోనల్ అధికారి, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ

కార్యదర్శి కక్కుర్తి

- రాజీనామా చేసిన కారోబార్ వేతనం నొక్కేశాడు
- ఆరు నెలల వేతనాలు మరొకరి ఖాతాలో జమ
- విషయం తెలిసి ఫిర్యాదు చేసిన మాజీ కారోబార్

కోటపల్లి: పంచాయతీ కారోబార్‌గా రాజీనామా చేసిన వ్యక్తి పేరిట ఆరునెలల వేతనాలను వేరే వ్యక్తి బ్యాంక్ ఖాతాలో వేయించి కార్యదర్శి నొక్కేశాడు. ఈ ఘటన కోటపల్లి మండల కేంద్రం పంచాయతీలో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కోటపల్లి పంచాయతీలో 2021–24 వరకు కారోబార్‌గా కొంకటి సుందర్ పనిచేశాడు. వ్యక్తిగత కారణాలతో గత జూన్‌లో రాజీనామా చేశాడు. కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న సత్యనారాయణ.. సుందర్ పేరిట నెల వేతనం రూ.21,450, ఇలా ఆరునెలల వేతనాలను చెన్నూర్ పట్టణానికి చెందిన నలమాసు రమేశ్ అకౌంట్‌లో జమ చేశాడు. విషయం తెలుసుకున్న సుందర్.. కోటపల్లి పంచాయతీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ మహేంద్రనాథ్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. కోటపల్లి, పంగిడి సోమారం కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ పంచాయతీ నిధులు స్వాహాచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు కార్యదర్శిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోటపల్లి గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో లక్ష్మయ్య, తహసీల్దార్ మహేంద్రనాథ్ వివరణ కోరగా కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నిధులు రికవరీ చేసి కోటపల్లి ఇన్‌చార్జిగా సత్యనారాయణను తొలగిస్తామన్నారు.

విహారయాత్రలో విషాదం

- కర్ణాటకలోని మైసూరు వద్ద కారు బోల్తా
- ప్రమాదంలో ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు
- మృతుల్లో మంచిర్యాల యువకుడు

మంచిర్యాలక్రైం: డిసెంబర్ 31 సెలబ్రేషన్స్ కోసం కర్ణాటక వెళ్లిన నలుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల విహారయాత్ర విషాదంగా మారింది. సంతోషంగా గడపాలనుకున్న వారి ఆశ మార్గమధ్యలోనే ఆవిరైంది. శనివారం తెల్లవారుజాము మైసూరు సమీపంలో వీరి కారు బోల్తాపడిందని సమాచారం. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మృతుల్లో మంచిర్యాల వాసి యువకుడు ఉన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..జిల్లాకేంద్రంలోని దొరగారిపల్లెకు చెందిన బల్లపల్లి శంకరమ్మ–వెంకన్న కుమారుడు సందీప్ హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సందీప్ తన మరో ముగ్గురు స్నేహితులతో కలిసి శుక్రవారం కారులో కర్ణాటకకు బయల్దేరారు. శనివారం వేకువజామున మైసూరు సమీపంలోకి చేరుకోగా అదుపు తప్పి బోల్తాపడినట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో సందీప్ మృతి వార్త విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మైసూరు బయల్దేరి వెళ్లారు. సందీప్ మృతితో దొరగారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆదివారం సాయంత్రం సందీప్ మృతదేహం మంచిర్యాలకు చేరుకునే అవకాశం ఉంది.



సందీప్ (ఫైల్)

నిర్మల్‌లో వివాహితపై లైంగికదాడి

- భర్తతో గొడవపడి బయటకు వచ్చిన మహిళ
- లాడ్జికి తీసుకెళ్లి ఓ వ్యక్తి అఘాయిత్యం
- బాధితురాలికి ఎస్పీ జానకీ షర్మిల పరామర్శ



బస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల, డీఎస్పీ గంగారెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలో వివాహితపై లైంగికదాడి జరిగింది. రాత్రి సమయంలో భర్తతో గొడవపడి బయటకు వచ్చిన ఆమె నిస్సహాయతను ఆసరాగా చేసుకుని ఓ వ్యక్తి లాడ్జికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా కేంద్రానికి చెందిన మహిళ భర్తతో గొడవపడి శుక్రవారం రాత్రి 11గంటల ప్రాంతంలో బస్టాండ్‌కు వచ్చింది. అక్కడ యోగేష్ అనే వ్యక్తి ఆమెకు పరిచయం అయ్యాడు. డబ్బులు అవసరం ఉన్నాయని ఆమె అడుగగా.. యోగేష్ తనకు పరిచయం ఉన్న కళ్యాణ్ అనే వ్యక్తికి ఫోన్ చేసి రప్పించాడు. బస్టాండ్‌కు వచ్చిన కళ్యాణ్ ఆమెను పట్టణంలోని ఓ లాడ్జికి తీసుకెళ్లాడు. లొంగదీసుకోవాలని ప్రయత్నించగా ఆమె నిరాకరించింది. దీంతో ఆమెపై బలవంతంగా లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం బస్టాండ్‌కు వచ్చిన మహిళ ఓ ఆటోలో స్పృహకోల్పోయి పడిపోయింది. ఆటోడ్రైవర్ అక్కడే ఉన్న బ్లూకోల్ట్స్ సిబ్బందికి సమాచారం అందించాడు. వెంటనే ఆ మహిళను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ జానకీ షర్మిల శనివారం ఆమెను ఆస్పత్రిలో పరామర్శించారు. అనంతరం బస్టాండ్ ప్రాంతంలోని ఘటన స్థలాన్ని క్లూస్ టీం సిబ్బందితో కలిసి పరిశీలించి వివరాలు సేకరించారు. రాత్రి సమయంలో డ్యూటీ చేసే పోలీసులకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

ఘటనపై మంత్రి సీతక్క ఆరా

జిల్లా కేంద్రంలో వివాహితపై జరిగిన అత్యాచార ఘటన గురించి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క శనివారం రాత్రి ఆరా తీశారు. ఎస్పీ జానకీ షర్మిలతో ఫోన్‌లో మాట్లాడారు. అత్యాచారానికి పాల్పడినవారు ఎంతటి వారైనా ఉపేక్షించొద్దని ఆదేశించారు.

బెల్లంపల్లి అభివృద్ధికి 'సొసైటీ' నిధి..!

- అప్పట్లో రూ.6 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్
- రూ.40 లక్షలకు చేరిన వైనం..



సమావేశమైన ప్రస్తుత కమిటీ సభ్యులు (ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ప్రజోపయోగ అవసరాల రీత్యా సారా కాంట్రాక్టర్ల వద్ద నుంచి వసూలు చేసిన చందా డబ్బులు బ్యాంకులో భద్రంగా ఉన్నాయి. నాలుగు దశాబ్దాల క్రితం అప్పటి రాజకీయ, కార్మిక, వ్యాపార, పుర ప్రముఖులు ఏకమై బ్యాంకులో రూ.6 లక్షలు ఫిక్స్‌డ్ చేయగా ప్రస్తుతం రూ.40 లక్షల వరకు చేరుకున్నాయి. వీటిని భవిష్యత్ ప్రజోపయోగ కార్యక్రమాలకు ఖర్చు చేయాలనే పట్టుదలతో ఉండగా, సరైన అవసరాలను గుర్తించడంలో నిర్లక్ష్యం జరుగుతోంది.

ముగ్గురు సభ్యుల సంతకాలతో..

రూ.6 లక్షల చందా డబ్బులను అప్పటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ప్రస్తుత ఎస్బీఐ) బెల్లంపల్లి శాఖ బ్యాంకులో ఫిక్స్‌డ్ చేశారు. కమిటీ సభ్యులు తాటిపాముల నాగయ్య, గోనే శ్యాంసుందర్‌రావు, రతన్‌లాల్ ఈ ముగ్గురిలో ఇద్దరు సంతకం చేసి డబ్బులు విత్ డ్రా చేసేలా నిర్ణయించారు. ఇప్పటివరకు రూ.5 లక్షల వరకు విత్‌డ్రా చేసి ఖర్చుపెట్టారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ, అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.4 లక్షలు, భారత స్వర్ణోత్సవ వేడుకల నిర్వహణకు రూ.లక్ష వెచ్చించారు. మిగతా డబ్బులు బ్యాంకులో నిల్వ ఉండటం గమనార్హం.

1982లో సొసైటీ రిజిస్ట్రేషన్

సింగరేణి బొగ్గు గనులతో 1980లో బెల్లంపల్లి ఎంతగానో విరాజిల్లింది. పారిశ్రామిక క్షేత్రంగా ఉన్న బెల్లంపల్లిని విద్యా, సాంస్కృతిక పరంగా అభివృద్ధి చేసుకోవాలనే లక్ష్యంతో 'ది బెల్లంపల్లి ఎడ్యుకేషనల్, కల్చరల్, సోషల్ డెవలప్‌మెంట్ సొసైటీ'ని ఏర్పాటు చేసి 1982లో రిజిస్ట్రేషన్ చేయించారు. సొసైటీ చైర్మన్‌గా బాశెట్టి గంగారాంను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా అప్పటి మాజీ ఎమ్మెల్యేలు గుండా మల్లేశ్, దాసరి నర్సయ్య, రాజకీయ, కార్మిక నాయకులు బాశెట్టి గంగారాం, తాటిపాముల నాగయ్య, చిప్ప నర్సయ్య, నామసాని రామారావు, వ్యాపార వర్గాలు రతన్‌లాల్, తేజ్ ప్రకాశ్, మంచిర్యాలకు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు గోనే శ్యాంసుందర్‌రావు, అప్పటి బడా సారా కాంట్రాక్టర్ కె.సాగర్‌రావు ఉన్నారు. కాగా, కమిటీ సభ్యుల్లో గుండా మల్లేశ్, డి.నర్సయ్య, బి.గంగారాం, టి.నాగయ్య, ఎన్.రామారావు, రతన్‌లాల్ మృతిచెందారు.

నిర్దేశిత లక్ష్యాలు

బెల్లంపల్లి అభివృద్ధికి కమిటీ సభ్యులు పలు లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. ప్రభుత్వ రంగంలో డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలలు, వ్యవసాయ పరిశోధన కేంద్రం మంజూరు, హైదరాబాద్–న్యూఢిల్లీ మార్గంలో ఉన్న బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌కు చర్యలు, ఆడిటోరియం నిర్మాణం, శ్మశానవాటికల్లో, పోచమ్మ చెరువు వద్ద కర్మకాండల నిర్వహణకు షెడ్లు, ఆర్టీసీ బస్‌డిపో మంజూరు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి, టీబీ రోగుల కోసం ఆసుపత్రి ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

పారదర్శకత పాటిస్తాం

బెల్లంపల్లి అభివృద్ధి కోసం వసూలు చేసిన చందా డబ్బులు బ్యాంకులో రూ.40 లక్షల వరకు పోగయ్యాయి. కమిటీ సభ్యుల్లో పలువురు మృతిచెందారు. వీరి స్థానంలో కొత్త సభ్యులను ఎన్నుకోవల్సి ఉంది. చందా డబ్బుల లెక్కలను ప్రజలకు త్వరలోనే బహిరంగ పరుస్తాం. దాపరికంగా వ్యవహరించం. పారదర్శకతను పాటిస్తాం.– గోనే శ్యాంసుందర్‌రావు, అభివృద్ధి కమిటీ సభ్యుడు

కొత్త కమిటీని ఏర్పాటు చేయాలి

కొత్త కమిటీని ఏర్పాటు చేసి సరైన మార్గదర్శకం చేయాల్సిన అవసరం ఉంది. బెల్లంపల్లిలో వ్యవసాయ పరిశోధన కేంద్రం, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, పీజీ, బీఎడ్, మహిళా డిగ్రీ కళాశాలల మంజూరుకు కృషి చేయాల్సి ఉంది. సాంస్కృతిక కా ర్యక్రమాలకు ఆడిటోరియం, పేదలకోసం ఫంక్షన్ హాల్ నిర్మించాలనే డిమాండ్ ఉంది. చదువులో రాణిస్తున్న పేదవిద్యార్థులను ప్రోత్సహించడానికి ఆర్థిక సాయం అందించాలని పలువురు కోరుతున్నారు.

గత యూనియన్ల అలసత్వంతోనే సమస్యలు



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

రెబ్బెన(ఆసిఫాబాద్): గతంలో గుర్తింపు కార్మిక సంఘంగా పనిచేసిన యూనియన్ల అలసత్వంతోనే కార్మికుల అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ముష్క సమ్మయ్య అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని వివిధ డిపార్టుమెంట్లలో శనివారం ఏఐటీయూసీ గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వారు హాజరై మాట్లాడారు. సింగరేణి స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో యాజమాన్యంతో చర్చించిన అంశాలను కార్మికులకు వివరించారు. సొంత ఇల్లు పథకం అమలు, 200 గజాల ఇంటి స్థలం, పెర్క్స్‌పై ఐటీ యాజమాన్యం చెల్లించేలా చూస్తామని, కొత్త ఇన్సెంటివ్ విధానాన్ని ప్రవేశపెడతామని, గైర్హాజరు శాతం తగ్గించేందుకు ప్రతి మూడు నెలలకోసారి మస్టర్ల ప్రతిపాదికన ప్రోత్సాహక బహుమతి ఇచ్చేవిధంగా యాజమాన్యంతో మాట్లాడామని అన్నారు. జూనియర్ అసిస్టెంట్స్ ప్రమోషన్ పాలసీలో మార్పులు, బదిలీ వర్కర్స్ విధానాన్ని ఎత్తివేసి జనరల్ మజ్దూర్‌గా అపాయింట్‌మెంట్ అయ్యే విధంగా చూస్తామన్నారు. డిస్మిస్ కార్మికులను వన్‌టైం సెటిల్‌మెంట్‌గా తీసుకునేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. సమావేశంలో గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషు, జగ్గయ్య, రాజేష్, కిరణ్‌బాబు, ఆనంద్, దివాకర్, ఫిట్ కార్యదర్శులు శ్రీనివాస్, రామయ్య, అశోక్, నాయకులు ఓదెలు, శ్రీనివాస్, అంజయ్య, రాంకిషన్, గోపాల్, సురేష్‌కోరి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సీఆర్టీల నిరవధిక సమ్మెకు మద్దతు



మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఉమ్మడి జిల్లాకు చెందిన సీఆర్టీలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. శనివారం నాటికి సమ్మె 13వ రోజూ చేరింది. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆదిలాబాద్ మాజీ జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్‌లు వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆరు నెలల వేతనాలు అందకపోవడంతో సీఆర్టీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉద్యోగ క్రమబద్ధీకరణతోపాటు ప్రమాదంలో మృతిచెందిన సీఆర్టీలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. తుడుందెబ్బ మహిళా నాయకురాలు పెందోర్ పుష్పరాణి, నాయకులు అలీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జలపాతం వద్ద 'బుల్లెట్‌రెడ్డి' షూటింగ్



పాట చిత్రీకరణలో హీరో, హీరోయిన్

బోథ్: మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద శనివారం 'బుల్లెట్‌రెడ్డి'సినిమా షూటింగ్ నిర్వహించారు. జలపాతం అందాల మధ్య నిర్మాత , దర్శకుడు, హీరో ఆదిరెడ్డి, హీరోయిన్ హానికలకు సంబంధించి పాట చిత్రీకరించారు. జలపాతంతోపాటు అర్బన్ పార్కులోనే రెండు పాటలు పూర్తి చేశారు. తమకు సహకరించిన బోథ్ ప్రజలు, అధికారులకు హీరో ఆదిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

నాటిన మొక్కలకు ఆన్‌లైన్ నమోదు



యాప్‌లో నమోదు చేస్తున్న మాజీ సర్పంచ్

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కే) గ్రామంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి ఆధ్వర్యంలో నాటిన మొక్కలను శనివారం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా నాటిన ప్రతీ మొక్కను ఫోన్ ద్వారా వనమాలి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి మొక్కకు ఒక్క బార్‌కోడ్ వస్తుందని, ప్రపంచంలో ఎక్కడ నుంచైన చూసే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలోనే ముఖరా(కే) గ్రామంలో మొక్కలను ఆన్‌లైన్ చేయడం తొలిసారని పేర్కొన్నారు.

చెట్లపొదల్లోకి దూసుకెళ్లిన కారు

ఆదిలాబాద్‌రూరల్: మావల సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్లపొదల్లోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఇచ్చోడ నుంచి పవన్, ప్రవీణ్‌లు కారులో శనివారం ఆదిలాబాద్‌కు వస్తున్నారు. మార్గమధ్యలో అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారికి చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

నారుమడుల్లో జాగ్రత్తలు పాటించాలి

- రైతులు సూచనలు పాటిస్తే దిగుబడులు



యామిని, ఏవో, చెన్నూర్



వరినారు మడిని పరిశీలిస్తున్న ఏవో

చెన్నూర్‌రూరల్: యాసంగి సీజన్‌లో వరి సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. కొందరు నారు పెంచేందుకు మడులు సిద్ధం చేసి విత్తనాలు చల్లారు. నారుమడుల పట్ల తగు జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని చెన్నూర్ ఏవో యామిని వివరిస్తున్నారు. నారుమడుల్లో కలుపు, ముఖ్యంగా ఊద సమస్యలు ఎక్కువగా ఉంటాయి. దీని నివారణకు ఎకరా నారుమడికి బుటీక్లోర్ 1.5 లీటర్ తీసుకుని 200ల లీటర్ల నీటిలో కలిపి విత్తనాలు విత్తిన సమయంలో లేక, 8వ రోజున మడిలో పిచికారీ చేయాలి. లేదా విత్తిన 14 నుంచి 15 రోజుల్లో సైహలోపాప్ బ్యుటైల్ 10 శాతం 400మి.లీ. 200ల లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నాట్లు వేసిన 4 నుంచి 5 రోజులకు ఎకరాకు 30–40 గ్రాముల ఆక్సిడయార్జిల్ 25 కిలోల ఇసుకతో కలిపి చల్లుకోవాలి. పిచుకలు, అడవిపందులు రాకుండా నారుమడికి నాలుగు వైపులా నాలుగు పొడవాటి కర్రలు ఏర్పాటు చేసి కవర్లు తొడగాలి. గాలివీచినప్పుడు కవర్లు చప్పుడు అయ్యి అవి దగ్గరకు రావు. లేదంటే కర్రలకు ఖాళీ సీసాతోపాటు నట్‌బుల్లోట్‌ను ఏర్పాటు చేయాలి. లేదా పాత పల్లానికి రంధ్రం చేసి దానికి బుల్లోట్ కట్టినట్లయితే గాలికి అవి కదిలి శబ్దానికి పిచుకలు, అడవిపందులు అటువైపుగా రావు. ఇలా చేస్తే రైతులు నారుమడులను కాపాడుకోవచ్చు.

తెలంగాణ ఉద్యమకారుడి మృతి

తానూరు: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేసిన భోసి గ్రామానికి చెందిన ఉద్యమకారుడు రాఘవులు (75) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. 2010 జనవరి 11న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొట్టమెదటగా తానూరు మండలం భోసి గ్రామంలో ఐదు రోజులు ఆయన ఆమరణ నిరహార దీక్ష చేపట్టారు. తెలంగాణ సాధనకు ఎంతో కృషిచేశారు. వయస్సు రీత్యా అనారోగ్యం బారినపడి నిజామాబాద్‌లోని ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటుండగా మృతిచెందారు. ఆయన మృతిపట్ల ఉద్యమకారులు గ్రామస్తులు సంతాపం ప్రకటించారు. ఉద్యమ సమయంలో అయన చేసిన సేవలను కొనియాడారు.



రాఘవులు (ఫైల్)